**కథానిక**

# మీసం

మల్లాది వెంకటకృష్ణమూర్తి

చలమేశ్వరరావు, నేను ఎలిమెంటరీ స్కూల్‌లో, ఒకే క్లాస్‌లో, ఒకే బెంచీమీద పక్కపక్కన కూర్చునే వాళ్ళం. వాడి కోరికలు, భావాలు నాకు కొట్టిన పిండే.

తర్వాత థర్డ్ ఫారం దాకా ఒకే స్కూల్‌లో చదివాం. వాడు నాకన్నా పొడుగు కాబట్టి వాణ్ణి వెనక బెంచీలోకి తోసేసారు అయినా మా స్నేహం ఆ స్కూల్లో వృద్ధవుతూ వచ్చింది.

మా ఇంగ్లీష్ టీచర్‌కి చక్కని మీసాలుండేవి. నల్లగా, గుబురుగా, నిగనిగలాడుతూ ఆయన ముఖానికి అవి ఎంతో అందాన్నిచ్చేవి. సినిమా హీరోలా సన్నగా ఫ్రెంచ్ కట్ మీసం కాదు. టూత్‌బ్రష్ మీసం కాదు. హిట్లర్ మీసం కాదు.

తాండ్ర పాపారాయుడికున్నట్టు ఎంతో హుందాగా వుండేదా మీసం. చలమేశ్వరరావుకి ఆయన మీసాలంటే ఎంతో ఇష్టం. తను కూడా పెద్దయ్యాక అలాంటి మీసాలు పెంచాలని కలలు కనేవాడు.

ఫోర్త్‌ఫారంలో నేను కాంపోజిట్, వాడు జనరల్ మేథ్స్ తీసుకోవటంతో ఇద్దరం విడిపోయాం. అయినా స్కూల్‌కి కలసి వెళ్ళేవాళ్ళం, కలసి వచ్చేవాళ్ళం. మా సెక్షన్లు వేరయినాయి.

మా నాన్నగారికి బదిలీ అవటంతో నేను కాకినాడ వదిలి హైదరాబాద్ వచ్చేసాను. ఆ తర్వాత చాలా వూళ్ళు తిరిగాం.

మళ్ళీ పదేళ్ళ తర్వాత కాకినాడ వెళ్ళాను. చలమేశ్వరరావు సంగతి పూర్తిగా మర్చిపోయాను! వాళ్ళు ఇంకా అదే ఇంట్లో వుంటున్నారు. మా ఇంటి ప్రక్కనే అది.

చలమేశ్వరరావు నన్ను చూసి, గుర్తుపట్టి, పలకరించాడు. అరగంటసేపు మాట్లాడుకొన్నాం వివిధ విషయాలు.

అప్పుడు గుర్తొచ్చింది నాకు చలమేశ్వరరావు మీసాల కోరిక. శుభ్రంగా షేవ్ చేసేసుకొన్నాడు గడ్డం, మీసం.

కారణం అడిగాను.

"ఏం లేదు" అని నవ్వి వూరుకున్నాడు.

మర్నాడు తెలిసింది. చలమేశ్వరరావు షేవ్ చేసుకోకపోవటం వల్ల, చిన్నతనంలోనే వాడికి అనేక ఎదురుదెబ్బలు తగిలాయి. తండ్రి పోయాడు, తల్లి పిచ్చిదైంది. భార్య పెళ్ళయిన రెండు నెలలకే వదిలేసింది. జీతం చాలే వుద్యోగం కాదు.

ఫలితంగా గడ్డం, మీసం ముసలివాని లాగా బాగా నెరసిపోయాయి!

**కొలబద్దలు**

అతి సామాన్య సూత్రాలు, నా కొలబద్దలు. జీవితాన్ని పెంచేది శారీరక, మానసికారోగ్యానికి సాయపడేదంతా మంచిది. జీవితాన్ని హ్రస్వపరచేది, బాధించేది, కృంగదీసేది వికృతం చేసేదంతా చెడ్డ.

జాక్ లండన్